

నాటి స్మృతులు
- స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఊరంతా సంబరాలే..
- అప్పటి పరిస్థితిని నెమరు వేసుకుంటున్న వృద్ధులు

8లో



జిల్లాకు భారీ వర్ష సూచన

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఐదు రోజులు సెలవులు రద్దు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం
- నాగావళికి పోటెత్తిన వరద



గరుగుబిల్లి:తోటపల్లి స్పిల్‌వే నుంచి దిగువకు నీరు విడిచిపెట్టిన దృశ్యం

పార్వతీపురం/టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావారణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధికారులు ఐదు రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు చేపట్టాలి. జిల్లాలో ఎక్కడ ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఈ ఐదు రోజులు అధికారులకు ఎటువంటి సెలవులు మంజూరు చేయబడవు. విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటాం. కొండవాలు, నది పరివాహక, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను, పాడైన గృహాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. గర్భిణులు, వయసు మీరిన వారిని సమీప ఆసుపత్రి లేదా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంచాలి. పిడుగులు (మిగతా 10వ పేజీలో..)



పార్వతీపురం ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు

జెండా పండుగకు సర్వం సిద్ధం



సిద్ధమైన వేదిక

- స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన మన్యం
- పూర్తయిన ఏర్పాట్లు
- జెండా ఆవిష్కరించనున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జెండా పండగకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కళాశాల మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. ప్రభుత్వ పనితీరును తెలిపేలా శకటాలను ప్రదర్శించనున్నారు. పోలీస్ పరేడ్, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కలెక్టర్ కోరారు.

599 మందికి ప్రశంసాపత్రాలు

జిల్లాలో రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య తదితర శాఖల్లో (మిగతా 10వ పేజీలో..)

వాహనంలో 68 కిలోమీటర్లు పయనించి.. వర్షంలో 3 కిలోమీటర్లు నడిచి

- గిరిశిఖర గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు
- తోణాం వైద్యసిబ్బంది సాహసం



వర్షంలో గొడుగులు వేసుకుని నడిచి వెళ్తున్న తోణాం వైద్య బృందం

సాలూరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు(ఏవోబీ)లోని గిరిశిఖర గ్రామాలైన డెన్సరాయి, రేవడివలసలో గిరిజనులకు వైద్య సేవలందించడానికి తోణాం వైద్యసిబ్బంది పెద్ద సాహసం చేశారు. చంద్రన్న సంచార వైద్య చికిత్సలో భాగంగా గురువారం తోణాం వైద్యాధికారి అక్యాన అజయ్ ఆధ్వర్యంలో వైద్య బృందం డెన్సరాయి, రేవడివలస గ్రామాలకు బయలుదేరింది. ఈ గ్రామాలకు ఒడిశా మీదుగా వెళ్లాల్సి ఉంది. దీంతో ఈ బృందం ఒడిశా రాష్ట్రం సుంకి, రాళ్లగెడ్డ తదితర గ్రామాల మీదుగా వాహనంలో 68 కిలోమీటర్లు పయనించి ఏపీ బోర్డర్‌లోని గడివలసకు చేరుకుంది. అయితే, తుపాన్ ప్రభావంతో అక్కడ ఒకపక్క జోరు వర్షం కురుస్తుండడం.. మరోపక్క రోడ్డు బాగులేకపోవడంతో వైద్య బృందం దాదాపు మూడు కిలోమీటర్లు వర్షంలో నడిచి డెన్సరాయి, రేవడిలసకు చేరుకుని 45 మందికి వైద్యసేవలు అందించింది. 9 మంది గర్భిణులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి అజయ్ వివరించారు. ఎనిమిదో నెల పూర్తికావస్తుండగానే సాలూరులో ఉన్న గర్భిణుల వసతిగృహంలో చేరాలని వారికి సూచించారు.



డెన్సరాయిలో గిరిజనులకు వైద్యసేవలందిస్తున్న తోణాం వైద్యుడు అజయ్

పార్వతీపురం మీదుగా వెళ్లే రైళ్ల రద్దు



పార్వతీపురంటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖాధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, డొంకిన వలస రైల్వేస్టేషన్ల పరిధిలో జరుగుతున్న మూడోలైన్ పనుల నేపథ్యంలో ఈనెల 19 నుంచి 27 వరకు కొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా విజయనగరం వరకు నడపనున్నట్లు చెప్పారు. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖపట్నం-రాయపూర్ పాసింజర్ (58258), విశాఖ-కోరాపుట్ డీఎంయూ(58538), విశాఖ-భవానీపట్నం పాసింజర్(58504), రాయపూర్-విశాఖ పాసింజర్(58257), కోరాపుట్-విశాఖ డీఎంయూ(58537), భవానీపట్నం-విశాఖ పాసింజర్(58503)ను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19 నుంచి 26 వరకు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్(17243) విజయనగరం వరకే నడుస్తుందన్నారు. ఈనెల 20 నుంచి 27 వరకు రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) విజయనగరం నుంచి బయలుదేరుతుందని అన్నారు. 21 నుంచి 27వ తేదీ వరకూ దుర్గ్-విశాఖ వందే భారత్(20829) మూడు గంటలు ఆలస్యంగా, 24, 26 తేదీల్లో నాందేడ్-సంబల్పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్(20810) నాలుగు గంటలు ఆలస్యంగా, 21 నుంచి 27వ తేదీ వరకూ విశాఖపట్నం- దుర్గ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్(20830) 2.30 గంటలు ఆలస్యంగా నడుస్తాయని అన్నారు. ఈనెల 20, 21, 23, 24, 26 తేదీల్లో విశాఖ-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్(12807) 5 గంటల ఆలస్యంగా బయలు దేరుతుందని, ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

హర్‌ఘర్ తిరంగాలో భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాల వద్ద గురువారం ఉదయం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. 250 మీటర్ల జాతీయ జెండాతో ఆర్‌సీఎం పాఠశాల నుంచి బయలుదేరిన ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మన దేశభక్తిని, స్ఫూర్తిని సమైక్యతవాదాన్ని పిల్లల్లో పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఇంటిపై జెండా ఎగురవేసి, సెల్ఫీ తీసుకొని హర్‌ఘర్ తిరంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ..



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర

స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు ఎందరో ఉన్నారని, అందులో జిల్లావాసులు ఉండడం గర్వకారణమన్నారు. అటువంటి మహాభావులను స్మరించుకుంటూ, దేశం తర్వాత ఏదైనా అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా అధికారులు, వివిధ కళాశాలలు, పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి సంధ్యారాణి 10లో

విచారణ నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం

- డీపీవో కొండలరావు 10లో

నీటి సంరక్షణలో జిల్లా భేష్

- దేశంలో అత్యుత్తమ 10 జిల్లాల్లో విజయనగరానికి చోటు 8లో
- అభినందించిన సీఎం చంద్రబాబు

సాలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

- అధికారులు సెలవులో ఉండడమే కారణం

సాలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూక్రయ, విక్రయదారులు, స్థిరాస్తి, విలువ ధ్రువపత్రం, జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్లతో నిత్యం బిజీగా ఉండే సాలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గురువారం కళ తప్పింది. సబ్ రిజిస్ట్రార్ వీవీ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ డీటీవీ రమణమూర్తి సెలవులో ఉండడంతో కార్యాలయంలో సేవలు నిలిచిపోయాయి.



ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కుర్చీ

ఈ కార్యాలయంలో జరిగే వివిధ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ప్రతిరోజూ రూ.3లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం వస్తుంటుంది. గురువారం మాత్రం ఈ ఆదాయం రాలేదు. ఈ విషయంపై జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మీపట్నాయక్‌ను వివరణ కోరగా.. 'సబ్ రిజిస్ట్రార్ నాగరాజుకు సెలవు మంజూరు చేశాం. సీనియర్ అసిస్టెంట్ బీటీవీ రమణమూర్తి అకస్మాత్తుగా సెలవుపై వెళ్లారు. జిల్లాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక అధికారిని సాలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపించాం. అక్కడ ఎలాంటి లావాదేవీలు జరగకపోవడంతో ఆయన తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.'అని ఆమె తెలిపారు.

యూరియా వచ్చేదెప్పుడు?



పార్వతీపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అదును దాటిపోతున్నా జిల్లాకు ఇంకా పూర్తిస్థాయిలో యూరియా సరఫరా కాలేదు. ఇంకా ఏడువేల టన్నుల యూరియా కొరత ఉంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే), సహకార సంఘాల ద్వారా యూరియాను అరకొరగా సరఫరా చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పైగా కాంప్లెక్స్ ఎరువులు కొంటనే యూరియా ఇస్తామని షరతు పెడుతున్నారు. మరికొందరు వ్యాపారులు రసాయన యూరియా లేదని చెప్పి నానో యూరియాను అంటగడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నానో (మిగతా 10వ పేజీలో..)

- జిల్లాలో తీవ్ర కొరత
- ఇంతవరకు 14,481 టన్నులే సరఫరా
- ఇంకా 7వేల టన్నులు అవసరం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఆ మూడు దుకాణాల్లో ఎరువుల అమ్మకాలకు బ్రేక్

నాటి స్మృతులు

- స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఊరంతా సంబరాలే..
- అప్పటి పరిస్థితిని నెమరు వేసుకుంటున్న వృద్ధులు
- 1864లోనే బొబ్బిలిలో సంస్థానం ఉన్నత పాఠశాల
- దేశవిదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు



సంస్థానం ఉన్నత పాఠశాల

బొబ్బిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతోంది. నాటి ఉద్యమాన్ని కళ్లారా చూసిన వారు నేటికీ అక్కడక్కడా ఉన్నారు. స్వాతంత్ర్యం రాకమునుపు, వచ్చిన రోజు పరిస్థితులను వారు నెమరు వేసుకుంటున్నారు. ఉద్యమంలో నేరుగా పాల్గొనకపోయినా.. నాటి యోధుల స్ఫూర్తిని గుర్తు చేసుకుంటున్నారు. బొబ్బిలి పట్టణానికి చెందిన వృద్ధులు నాటి పరిస్థితులను వివరించారు.

గొల్లపల్లిలో పెద్ద మీటింగు పెట్టారు..



1947లో స్వాతంత్ర్యం వచ్చిన విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్నాం. ముందుగానే ఈ ప్రకటన వెలువడడంతో బొబ్బిలిలోని గొల్లపల్లి ఎయిడెడ్ పాఠశాలలో జాతీయజెండా ఎగురవేశారు. నాకు అప్పుడు 13 ఏళ్లు. ఐదోతరగతి పూర్తి చేశాను. 200 మంది విద్యార్థులం హాజరయ్యాము. పాటలు పాడారు. పాఠశాల హెచ్‌ఎం అండ్ మేనేజరు అయిన మల్లమ్మపల్లి అప్పలస్వామి, మాస్టారు చుండూరి గున్నేశ్వరరావు ప్రసంగించారు. నేను, మరో విద్యార్థి కూడా ఉద్యమం గురించి మాట్లాడాము. రెండో ప్రపంచ యుద్ధకాలంలో నేను ఇంకా చిన్నవాడిని. అప్పట్లో చాలా తక్కువ ఎత్తులో విమానాలు హోరెత్తేవి. రాజావారి గెస్ట్‌హౌస్ నుంచి బొబ్బిలి పట్టణమంతా పెద్ద సంఖ్యలో పోలీసు కవాతు జరిగేది. తహసీల్దారు, స్కూలు ఇన్‌స్పెక్టరు వంటి ఉద్యోగాల్లో బ్రిటీషువారే ఉండేవారు. కిందిస్థాయి ఉద్యోగాల్లో మాత్రమే మనవారు పనిచేసేవారు.

-రాములు, రిటైర్డ్ హైస్కూలు హెచ్‌ఎం, పాతబొబ్బిలి

● ఊరంతా ఉత్సాహం..



స్వాతంత్ర్యం వచ్చిన నాటికి నా వయస్సు 19 ఏళ్లు. బానిస బతుకులకు విముక్తి కలిగిందని ఊరంతా ఉవ్వెత్తున ఉత్సాహం వెల్లివెరిసింది. ఎన్నో పండుగలను కలిసి చేసుకున్నంత సందడి నెలకొంది. ఎవరి జేబుల్లో ఎంత ఉంటే అంత సునాయాసంగా ఖర్చుచేశారు. గాంధీ, బోసు, పటేల్, అల్లూరి సీతారామరాజు వంటి వారి పేర్లు వింటే జనమంతా ఉబ్బితబ్బిబ్బయ్యేవారు. విశాఖలో గాంధీ, నెహ్రూ మీటింగుల కోసం అప్పటి మా తోటి యువకులమంతా పరుగులు తీసేవారము. నిత్యమూ ఉద్యమం కోసం పెద్దలు చర్చించుకునేవారు. మేమంతా ఆసక్తిగా ఆలకించేవారము. బ్రిటీషువారు చేసే ఆగడాలు చెబుతుంటే ఏడ్చుకునేవాళ్లము.

-సత్యనారాయణ, శ్రీకళాభారతి అధ్యక్షుడు, బొబ్బిలి

● వేరుశనగకాయల కుప్పల్లో సైకిళ్లను దాచాము..



అప్పట్లో సైకిలు తొక్కుతుండగా బ్రిటీషు పోలీసులకు కనిపిస్తే వాటిని లాక్కునేవారు. రైతులు నాటుబండిపై ఎక్కి కనిపించినా వారు సహించేవారు కాదు. వారు అల్లంత దూరాన ఉంటే పక్కకు తప్పించుకోవాల్సిందే. ఓ రోజు మా అందరి సైకిళ్లను తీసుకెళ్లడానికి పోలీసులు వస్తున్నారని తెలుసుకుని ఓ గోదాములో పెట్టి వేరుశనగ కాయలతో కప్పి ఉంచాము. స్వాతంత్ర్యం వచ్చిన విషయాన్ని దినపత్రికల్లో చూసి తెలుసుకున్నాము. మా గురువు ఆకుండి రాజేశ్వరరావు పోస్టుమాస్టర్‌గా కూడా పనిచేసేవారు. ఆయన ప త్రికలు తెప్పించేవారు. ఆయన ద్వారా ఊరందరికీ ఈ సమాచారం అందింది. నాకు అప్పుడు ఎనిమిదేళ్లు.

-కందుల ధర్మరాజు, రిటైర్డ్ టీచరు, గజరాయునివలస, బాడంగి మండలం

గాంధీపై లాఠీ దెబ్బలు పడకుండా అడ్డుపడి..



అయ్యగారి నారాయణ మూర్తి, బొబ్బిలి

బొబ్బిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న అయ్యగారి నారాయణ మూర్తి బొబ్బిలి గాంధీగా పేరు తెచ్చుకున్నారు. పట్టణంలోని చర్చివీధి సెంటరులో ఉండే నారాయణమూర్తి అప్పట్లోనే అసోసియేట్ మెంబర్ ఆఫ్‌ది అమెరికన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేశారు. బ్రిటీషు సర్కారీ నౌకరీ చేసేందుకు ససేమిరా అంటూ.. గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. గాంధీని కొట్టేందుకు వస్తున్న బ్రిటీషు సిపాయిల లాఠీలకు అడ్డుగా నిలబడ్డారు. దీంత నారాయణమూర్తి దుస్తులన్నీ రక్తంతో తడిసిపోయాయి. వెంటనే గాంధీ.. నారాయణమూర్తిని బొబ్బిలికి పంపించే ఏర్పాట్లుచేశారు. బ్రిటీషు లాఠీ దెబ్బలకు నారాయణ మూర్తి రెండు చేతులూ చచ్చుబడిపో యాయి. అప్పటి నుంచి బొబ్బిలి గాంధీగా పిలవనారంభించారు. బొబ్బిలి నుంచి పార్లమెంట్‌కి ఎన్నికైన వివి గిరి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు నారాయణ మూర్తి కన్నుమూశారు.



రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు, పాఠశాల వ్యవస్థాపకులు

పాటలతో రెచ్చగొడుతున్నారని..

- మధురగాయకుడు ఘంటసాలకు 18 నెలలు జైలు



ఘంటసాల

సాలూరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మధురగాయకుడిగా అందరికి సుపరిచితమైన ఘంటసాల వెంకటేశ్వరరావు స్వాతంత్ర్య సమరయోధుడన్న విషయం కొందరికే తెలుసు. మాకొద్ది ఈ తెల్లదొర తనం మొదలైన ఆరు దేశభక్తి పాటలు పాడి ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చారు. క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. పాటలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని బ్రిటీష్ పాలకులు ఆయన్ను అరెస్ట్ చేశారు. పాటకు మూడు నెలల చొప్పున ఆరు పాటలకు 18 నెలలు జైలు శిక్షను అలిపురం, బళ్లారి జైళ్లలో అనుభవించారు.

సంభాషణలు విని.. ఉత్తేజం చెంది

ఘంటశాల గురించి పరితపించే అభిమానులకే ఆయన స్వాతంత్ర్య కాంక్ష గురించి తెలుసు. ఘంటశాల చిన్నతనం నుంచి తెల్లవారి పాలనకు వ్యతిరేకించారు. చిన్నతనంలో స్వ గ్రామం చౌటుపల్లిలో చెరువుగట్టు వద్ద జరిగే స్వాతంత్ర్యం కోసం జరిగే సంభాషణలు విని ఆయన ఉత్తేజం చెందారు. ఆయన 1936 నుంచి 1942 సాలూరులో పట్రాయని సీతారామశాస్త్రి వద్ద సంగీతాభ్యాసం చేశారు.ఆ సమయంలో సాలూరులో జరిగే స్వాతంత్ర్యోద్యమాన్ని పరిశీలించారు. ఇతర ప్రాంతాల్లో జరిగే స్వాతంత్యపోరాటాలు తెలుసుకొని ప్రేరణ పొందారు. గాంధీజీ ఆంధ్రా పర్యటనలో కూడా ఘంటశాల పాల్గొన్నారు. గాంధీజీ దర్శనం తర్వాత స్వాతంత్ర ఉద్యమంలో జైలుకు కాదు నరకానికి సైతం నడిచినా ఫర్వాలేదని ప్రకటించారు.

1864లోనే సంస్థానం ఉన్నత పాఠశాల..

- దేశవిదేశాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు

బొబ్బిలి, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): బొబ్బిలి పట్టణంలో 1864లోనే సంస్థానం ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా పనిచేసిన, బొబ్బిలి ఆఖరి సంస్థానాధీశులు రాజా ఆర్‌ఎస్ ఆర్‌కే రంగారావు బాల బాలికల కోసం దీన్ని ఏర్పాటు చేశారు. సంస్థానం మిడిల్ స్కూల్‌గా ఉన్న ఇది ఉన్నత పాఠశాలగా 1882లో అప్ గ్రేడ్ అయింది. 'యు' ఆకారంలో భవనాలతో.. విశాలమైదానంతో పాఠశాలను తీర్చిదిద్దారు. 1908లో మరిన్ని హంగులను సమకూర్చారు. ఇక్కడ విద్యా బుద్ధులు నేర్చుకున్న వారు దేశవిదేశాల్లో అత్యున్నతమైన పదవులను పొందారు. క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు పెట్టింది పేరుగా ఈ పాఠశాల గుర్తింపు పొందింది. త్రివిధ దళాల అధిపతిగా పనిచేసిన జనరల్ కేవీ కృష్ణారావు ఇక్కడి విద్యార్థే. 1895-1926 వరకు పనిచేసిన హెచ్‌ఎం వి.రామలింగస్వామి పంతులు, ఆ తరువాత హెచ్‌ఎంలుగా పనిచేసిన డీఆర్ నాయుడు, టీవీవీ రామచంద్రరావు.. పాఠశాలకు వన్నె తెచ్చారు. రామలింగస్వామి పంతులు స్వయానా మనుమడు అదేపేరు కలిగిన డాక్టర్ రామలింగస్వామి, డాక్టర్ మురళీకృష్ణ అమెరికాలో పేరుగాంచిన వైద్యులుగా స్థిరపడ్డారు. అమెరికా అధ్యక్షుడి వైద్య సలహాదారులుగా పని చేశారు. ఎన్‌వీజీ కృష్ణస్వామి కేంద్ర ఆర్థిక శాఖలో ఉన్నతాధికారిగా పనిచేశారు. ప్రముఖ కంటి వైద్యనిపుణుడు డాక్టర్ కోటగిరి వెంగళరావు, ఆదాయపన్ను అధికారిగా పని చేసిన జగన్నాథరావు, సీనియర్ వైద్యులు డాక్టర్ రెడ్డి సత్యారావు తదితరులు ఈ పాఠశాలలో విద్యా బుద్ధులు నేర్చుకున్న వారే. హెచ్‌ఎం కార్యాలయం నుంచి అన్ని తరగతి గదులకు సమాచారం అందించేలా బ్రిటీషు కాలంలోనే రేడియోను ఏర్పాటు చేశారు.



వి.రామలింగస్వామి పంతులు (1895-1926 వరకు పనిచేసిన హెచ్‌ఎం

దేవాలయంగా భావించి అడుగుపెట్టేవారు..

బొబ్బిలి రాజా రంగారావు చాలా కఠినమైన క్రమశిక్షణ కలిగి ఉండేవారు. ఆయన లక్ష్యం మేరకు సంస్థానం పాఠశాలను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ పాఠశాలలో అడుగుపెట్టేముందు ఓ దేవాలయంగా భావించేవారు. వెనుకబడిన ప్రాంతంలో విద్యా బుద్ధులు ప్రసాదించి ఎంతో మందిని అత్యున్నత శిఖరాలను అధిరోహింపజేసిన సంస్థానం ఉన్నత పాఠశాలలో అలనాటి స్వాతంత్ర్య సమరయోధులు చదువుకున్నారు. అత్యుత్తమ గ్రంథాలతో కూడిన వేలాది పుస్తకాలతో ఉన్న లైబ్రరీ.. జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించింది.

-గోనా అప్పారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బొబ్బిలి



పుష్పాలంకరణలో గాయత్రీమాత

పుష్పాలతో గాయత్రీమాతకు అలంకరణ

రాజాం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీమాత ఆలయంలోని అమ్మవారిని గురువారం పుష్పాలతో అలంకరించారు. భక్తులు సమర్పించిన వందలాది పుష్పాలను అర్చకుడు వాసా జగదీశ్వరశర్మ అమ్మవారికి అలంకరించారు. శుక్రవారం నిర్వహించనున్న ప్రత్యేక పూజల్లో భక్తులంతా పాల్గొనాలని ఆలయ ధర్మ కర్త వివేకానందరావు కోరారు.

నీటి సంరక్షణలో జిల్లా భేష్

- దేశంలో అత్యుత్తమ 10 జిల్లాల్లో విజయనగరానికి చోటు
- అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్ ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ కట్టడాలు నిర్మాణంలో జిల్లాకు మంచి స్థానం దక్కింది. దేశంలోని అత్యుత్తమ పది జిల్లాలో విజయనగరం జిల్లాకు చోటు దక్కింది. కట్టడాల కారణంగా జిల్లాలో భూగర్భ జలమట్టం పెరిగిందని సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టరు అంబేడ్కర్‌ను అభినందించారు. వివిధ జిల్లా కలెక్టర్లతో గురువారం సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణలో దేశంలోని మొదటి పది జిల్లాలో ఏపీలోని ఆరు జిల్లాలు ఉన్నాయని, ఈ ఆరింటిలో విజయనగరం కూడా ఉండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కట్టడాల నిర్మాణం వల్ల జిల్లాలో భూగర్భ జల మట్టం పెరిగి, జూలై నాటికి 4.15 మీటర్లకు చేరిందని తెలిపారు. సాగునీటి సంఘాల ప్రాజెక్టు నీటి సంఘాల భాగస్వామ్యంతో భూగర్భ, ఉపరితల నీటి నిల్వలు పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరుతో పాటుజేసీ సేతు మాధవన్ ఉన్నారు.

స్వాతంత్ర దినోత్సవానికి పిరిడి వైద్యాధికారికి ఆహ్వానం



భరద్వాజ్

బొబ్బిలి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పిరిడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జి .భరద్వాజ్‌కు విజయవాడలో శుక్రవారం జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు రాజభవన్‌కు హాజరు కావాలని ఆహ్వానం అందింది. విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలకు గాను రాజభవన్ ఆహ్వానించినట్లు భరద్వాజ్ తెలిపారు.

కొత్తవలసలో కలకలం

- వరుస దొంగతనాలతో ప్రజల్లో భయాందోళన
- పోలీసులకు సవాల్ విసురుతున్న దుండగులు



కొత్తవలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు కలవరపడుతున్నారు. చోరులు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఎత్తుకుపైఎత్తులు వేస్తూ పట్టుబడకుండా తప్పించుకుంటున్నారు. రెండు నెలల కిందట మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్‌ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి ఫిర్యాదులో 90 తులాల బంగారం, రూ.5 లక్షలు నగదు పోయినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ చోరీ గురించి మర్చిపోక ముందే మండలంలో అక్కడక్కడ చిన్నా చితకా దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్ని పోలీసుస్టేషన్ వరకు వస్తున్నాయి. మరికొన్ని రావడం లేదు. స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు వేసే సవాలక్ష ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక వెళ్లడం లేదు.

- ఈనెల 9వ తేదీ రాత్రి కొత్తవలస బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న హెల్త్ అసిస్టెంట్ ఇంట్లో భారీ స్థాయిలో చోరీ జరిగింది. ఈ ఘటనతో ప్రజల్లో మరింతగా భయాందోళనలు మొదలయ్యాయి. ఈ చోరీలో 10 తులాల బంగారు ఆభరణాలు, లక్షా 50 వేల నగదు, 50 తులాల వెండి వస్తువులు చోరీ అయ్యాయి. ఒక్కరోజు రాత్రి ఇంట్లో లేకపోతేనే ఇంతలా దొంగతనం జరిగితే నాలుగైదు రోజులు క్యాంప్ వెళ్తే కంటిమీద కునుకు ఉండదేమోనని స్థానికులు భయపడుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఎవరి ఇంట్లో దొంగతనం జరుగుతుందోనన్న భయం ప్రజలకు పట్టుకుంది.
- గతంలో పోలీసులు రాత్రి వేళ వివిధ కాలనీలలో గస్తీ కాసేవారు. బీట్ పుస్తకాల్లో కాలనీ వాసులతో సంతకాలు చేయించుకునేవారు. తాము ఉన్నామని భరోసా కల్పించేవారు. ఇప్పుడు అటువంటిది ఎక్కడా కనిపించడం లేదు. విశాఖ-అరకు రోడ్డు దగ్గరలో ఉండడంతో పాటు రైళ్లు, బస్సుల రవాణా సదుపాయం ఉంది. దీంతో దొంగతనాలు చేసేవారు సులువుగా తప్పించుకుంటున్నారు. రాత్రి వేళల్లో సైతం ఇక్కడి నుంచి విశాఖ నగరంలోకి వెళ్లి పోవడానికి అవకాశం ఉంది. మహారాష్ట్రకు చెందిన పార్థీగ్యాంగ్ సభ్యులు మండలంలోని మంగళపాలెం గ్రామానికి వచ్చి దొంగతనం చేశారంటే ఈప్రాంతంలో దొంగతనాలు చాలా ఈజీ అని భావిస్తుండడమే. కేసులు కూడా నెలలుగా కొలిక్కి రావడం లేదు.



కనకమహాలక్ష్మికి పసుపుకొమ్ములతో అర్చన

విజయనగరం కల్చరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత సిటీబస్టాండ్ ఆవరణలో ఉన్న కనకమహాలక్ష్మీ ఆలయంలో శ్రావణ గురువారాన్ని పురస్కరించుకుని పసుపుకొమ్ములతో అర్చన నిర్వహించారు. అర్చకుడు గాయత్రీశర్మ ఆధ్వర్యంలో పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పసుపుకొమ్ములతో అర్చన

నేడు గోనా సీతారామస్వామి జయంతి



సీతారామస్వామి (ఫైల్)

బొబ్బిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గోనా సీతారామస్వామి జయంతిని శు క్రవారం కుటుంబ సభ్యులు నిర్వహించనున్నారు. పద్మనాయకవెలమ దొరల కుటుంబంలో 1902 ఆగస్టు 15 జన్మించిన సీతారామస్వామి నేరుగా స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్నారు. ఆయన పూర్వీకులు 1758లో జరిగిన బొబ్బిలి యుద్ధంలో పాల్గొన్నారు. 1921లో మహాత్మా గాంధీతో పరిచయమయ్యాక సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. హిందీ భాషోద్యమంలో కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. బొబ్బిలి జమీన్ రైతు, హరిజన్, యువజన వ్యవహారాల అధ్యక్షుడిగా పనిచేశారు. 1933లో గుంటూరులో బ్రిటీషు ప్రభుత్వం నిషేధించిన ఆంధ్ర పొలిటికల్ కాంగ్రెస్ సమావేశానికి, 1932లో కోల్‌కతాలో నిషేధించిన కాంగ్రెస్ సమావేశానికి హాజరై జైలుశిక్ష అనుభవించారు. 1946-52 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ్యుడిగా పనిచేశారు. ఏఐసీసీలో కూడా పనిచేశారు. కాగా స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రభుత్వం గుర్తించి తామ్రపత్రం బహూకరించింది. టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, వీవీ గిరి, కాసు బ్రహ్మానందరెడ్డి వంటి ప్రముఖులతో సన్నిహిత సంబంధాలను నెరిపినట్లు సీతారామస్వామి మనుమలు రిటైర్డ్ బ్యాంకు మేనేజరు గోనా రామారావు, బీజేపీ నేత ప్రసాదరావు తెలిపారు.

రైతులకు మంచి సేవలు అందించాలి



ప్రమాణస్వీకరణ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను చక్కగా నిర్వహించి రైతులకు మంచి సేవలు అందించాలని జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని బోనంగి, పెంట శ్రీరాంపురం పీఏసీఎస్‌సీ అధ్యక్షుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు పూర్తి స్థాయిలో రైతులకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రికి భూమి పూజ

ఎస్.కోట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పంచాయతీ చినఖండేపల్లి పరిధిలో శ్రీసాయి దివ్యామృతం అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా 100 పడకల క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణాన్ని తలపెట్టడం ఎంతో బాగుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ పాల్గొన్నారు. నిజాయితీతో కూడిన సేవలు అందించాలని ఎంపీ కోరారు. కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం

గుర్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం సంతతోట వద్ద గురువారం చంద్రబాబునాయుడు చిత్రపటానికి నాయీ బ్రాహ్మణులు పాలభిషేకం చేశారు. తమ సెలూన్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడం సంతోషకరమన్నారు. నాయకులు తిరుమలరాజు కిరణ్ కుమార్, వెన్ని సన్యాసినాయుడు, చనమల మహేష్, చీపురుపల్లి నియోజకవర్గ సాధికారిక సభ్యులు బెల్లాన సత్యనారాయణ, గంద్రేటి బాలాజీ, సీతారాం పాల్గొన్నారు.

జొన్నవలస పీఏసీఎస్ చైర్మన్‌గా అప్పలనర్సింహరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలనర్సింహరాజు

విజయనగరం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలం జొన్నవలస పీఏసీఎస్‌గా చైర్మన్‌గా పూసపాటి అప్పల నర్సింహరాజు(అప్పన్నబాబు) గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి, జొన్నవలస ఎంపీటీసీ పి.రాజేష్ వర్మ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు ఏపీఆర్వోగా పదోన్నతి

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్ ప్రభుదాస్‌కు ఈ కార్యాలయంలోని ఏపీఆర్వోగా పోస్టుకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆయన గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

బీఎల్వో విధుల నుంచి మినహాయించాలి

భోగాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీఎల్వో విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు అధికంగా పని ఒత్తిడి ఉంటుందని, బీఎల్వోలుగా చేయలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ అచ్యుతరావు, ఎస్.మదీనావల్లి, వి.పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

నల్ల జెండాలతో జిందాల్ నిర్వాసితుల నిరసన



నిర్వాసితులను అడ్డుకుంటున్న పోలీసులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో గత 55 రోజులుగా జిందాల్ నిర్వాసితులు శాంతియుతంగా నిరసన చేస్తున్నారు. గురువారం తమ ప్రాంతానికి ఎంపీ శ్రీభరత్, ఇతర ప్రజాప్రతినిధులు వస్తున్నారని తెలిసి.. తమ సమస్యలను విన్నవిద్దామని వెళ్లేందుకు ప్రయత్నించారు. నల్లజెండాలతో నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.

చిన్నపాటి వర్షానికే..

- రహదారిపై నిలిచిపోతున్న నీరు
- కాలువలు నిర్మించకుండా విస్తరణ పనులు చేపట్టిన వైనం
- నరకయాతన పడుతున్న వాహనచోదకులు



రహదారిపై నిలిచిన వర్షపునీరు

విజయనగరం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో మయూరి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా సీఎంఆర్ షాపింగ్ మాల్ వరకు కాలువలు నిర్మించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో ఏ మాత్రం వర్షం కురిసినా రోడ్డుపైనే వర్షంనీరు నిలిచిపోతుంది. అలాగే మురుగునీరు కూడా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.2.25 కోట్లతో 2022 సంవత్సరంలో రోడ్డు నిర్మాణం, సెంటర్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేశారు. అయితే అరకొరగా పనులు చేపట్టి చేతులు దులుపుకోవడంతో అప్పటి నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన తర్వాత విజయనగరం వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాత్రికి రాత్రే పనులు చేపట్టారు. ఈ విధంగా చేస్తే ఇబ్బందులు ఉంటాయని, ప్రొసిజర్ ప్రకారం పనులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులు చెప్పినా వైసీపీ పాలకులు వినలేదు. రోడ్డు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పాటించడంలేదని ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అప్పట్లో ఎవరు పట్టించుకో లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండడంతో రాకపోకలు సాగించలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్‌తో పాటు షాపింగ్ మాల్స్ ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే ఇదే రోడ్డులో జిల్లా పరిషత్ కార్యాలయం, ఆర్టీసీ అవుట్ గేటు ఉండడంతో వాహనాల రాకపోకలతో సందడిగా ఉంటోంది. దీంతో రాకపోకలు సాగించలేక వాహనచోదకులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డులో అవసరమైన చోట్ల కల్వర్టులను కూడా నిర్మించలేదు. వాహనచోదకులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ అధికారులు ప్రస్తుతం కల్వర్టులను నిర్మిస్తున్నారు.

రైతన్న అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ట్రాక్టర్‌పై నుంచి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం/రేగిడి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): రైతన్నల అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం రేగిడి మండలం ఉంగరాడమెట్ట నుంచి రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు ట్రాక్టర్లు, నాటు బళ్లతో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడంతో రైతులు సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి చంద్రబాబు



ట్రాక్టర్‌పై ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే కళా, ఎంపీ కలిశెట్టి

చీపురుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 37,792 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.24.32 కోట్లు అందించి ముఖ్యమంత్రి రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఈసందర్భంగా గురువారం చీపురుపల్లిలో రైతులతో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పడానికి ఇదొక నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై అవగాహన అవసరం

- ఎమ్మెల్యే నాగమాధవి



యంత్రంతో నాట్లు వేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణపై రైతులు అవగాహన చెందాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం గంగరావి చెరువు కింద పంట పొలంలో యంత్రంతో వరి నాట్లు వేయడాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంత్రీకరణతో తక్కువ సమయంలో ఎక్కువ పని జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం యంత్రాలను రైతులకు రాయితీపై అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల రాంబాబు, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, మాతా నవీన్, గుండపు సూరిబాబు, వరుపుల సుధాకర్, వ్యవసాయ అధికారిణి హైమావతి, ఏఈవో వెంకటరావు పాల్గొన్నారు.

మన డబ్బులు.. మన లెక్కలపై శిక్షణ

విజయనగరం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీసీ ఆవరణలో గురువారం మన డబ్బులు.. మన లెక్కలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి మాట్లాడుతూ జిల్లాలోని ఈ కార్యక్రమాన్ని మొదటి దశ కింద గజపతినగరం మండలంలో ఐదు గ్రామ సంఘాలు, రెండో దశ కింద విజయనగరం, జామి, గంట్యాడ, నెల్లిమర్ల డెంకాడ మండలాల్లో ఒక్కొక్క సంఘాన్ని ఎంపికచేసి మొత్తం 10 గ్రామ సంఘాల్లో అమలు చేస్తామన్నారు. ఈ పది సంఘాల్లో ఉన్న 213 స్వయం సహాయక సంఘాల సభ్యులు అన్ని రకాల పొదుపు, అప్పు నిల్వలను, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ బుక్ కీపింగ్ 2.0 యాప్‌లో నమోదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సావిత్రి, డీపీఎం చిరంజీవి, ఏపీఎం నారాయణరావు, సీసీలు రమణ, సత్యం పాల్గొన్నారు.

పేదవాడి పొట్ట కొట్టిన ఘనత వైసీపీదే

- ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి



అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదవాడి పొట్ట కొట్టిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. కొత్తవలస పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేయనున్న అన్నా క్యాంటీన్ భవనానికి ఆమె గురువారం భూమి పూజ చేశారు. పేదవాడి ఆకలి తీర్చడానికి కూడా జగన్మోహన్‌రెడ్డికి మనస్సు ఒప్పలేదన్నారు. గతంలో ఇక్కడ తాత్కలికంగా అన్నా క్యాంటీన్ నిర్వహించామని చెప్పారు. దురదృష్టవశాత్తు 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని రద్దు చేసిందన్నారు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, దాసరి సంక్షేమ అభివృద్ధి చైర్మన్ పీవీ రత్నాజీ, నాయకులు కనకాల శివ, బొబ్బిలి అప్పారావు, లెంక శ్రీను, కొరుపోలు అప్పారావు, బంగారు రమేష్, గొరపల్లి రాము, కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల చరిత్రను ప్రజలు తిరగ రాశారు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముప్పయ్యేళ్ల పాటు కొనసాగిన రాక్షస చరిత్రను పులివెందుల ప్రజలు తిరగ రాశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా స్వేచ్ఛగా ఓటు వేయడం తెలియని ఓటర్లు ఈ రోజు తొలిసారిగా ఓటు వేయడం మంచి పరిణామం అన్నారు. రౌడీయి జాన్ని, రాక్షసత్వాన్ని అక్కడి పోలీసులు ధైర్యంగా అడ్డుకున్నారన్నారు. పరిస్థితులు జీర్ణించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ సంప్రదాయాన్ని, సంస్కృతిని పక్కన పెట్టి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. ఆయన ఉపయోగించిన భాష, ఆయన నైజాన్ని తెలియజేస్తుందని నాగార్జున వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నాయకులు ప్రజల్ని, టీడీపీ నాయకుల్ని ఎంత హింసించారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు.

రెండు మినహా అజెండాలోని అంశాలన్నీ ఆమోదం



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు రాజేష్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మేయర్ వీవీ లక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 31 అంశాల్లో రెండు అంశాలు మినహా మిగిలిన అన్నింటికీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. గంటస్తంభం, ఎంజీరోడ్డు, ప్రకాశం పార్కు వద్ద తోపుడు బళ్లు, బడ్డీలు ఏర్పాటు చేశారని, వీటిని తొలగించాలని కోరారు. ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే నగరంలోని డాబాతోటలో ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలు 14 ఉన్నాయని, నగర పాలక సంస్థ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పీ-4 అమలుపై 6,076 మంది వచ్చా రని, వీరిలో ఎక్కువ మంది ధనవంతులు ఉన్నారని, దీనిని పునఃపరిశీలించాలని కోరారు. అనంతరం మేయర్ వీవీ లక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలు రేగాన రూపాదే వి, అల్లు చాణక్య, గొల్లపల్లి వెంకట రంగారావు, సుంకరి నారాయణస్వామి, నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



చీపురుపల్లి: జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు



విజయనగరం: గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



వంద అడుగుల జాతీయ జెండా

రాజాం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. ●

చీపురుపల్లి: పట్టణంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని ఈ ర్యాలీని ప్రారంభించారు. బీజేపీ ప్రతినిధి మన్నెపురి శ్రీనివాసరావు, డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు పాల్గొన్నారు. విద్యార్థులు జెండాను ఊరేగించారు.

వంద అడుగుల త్రివర్ణ పతాకం ఆవిష్కరణ

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోటలో గల మోతీ మహల్ లో గురువారం 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాన్సాస్ విద్యా సంస్థలు రూపొందించిన ఈ జెండాను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆమె ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ వంద అడుగుల జెండాను ఆవిష్కరించడం విజయనగరానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డా. కేవీఎల్ రాజు, మాన్సాస్ ఈవో కేఎన్ డీవీవీ ప్రసాద్, మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు విద్యార్థులు పాల్గొన్నారు.

బూరాడ పీహెచ్‌సీకి సిబ్బంది కొరత



బూరాడ పీహెచ్‌సీ

రేగిడి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బూరాడ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిబ్బంది సమస్య వేధిస్తోంది. సుమారు 13 సచివాలయాలు ఈ పీహెచ్‌సీ పరిధిలోకి వస్తాయి. సుమారు 40వేల మంది జనాభాకు ఇదే ఆధారం. అయితే ఇందులో కొన్ని పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నట్టు తెలుస్తోంది. కీలకమైన హెడ్‌క్వార్టర్ ఏఎన్ఎం పోస్టు గత ఏడాదిగా భర్తీ కాలేదు. ఆర్‌సీహెచ్-2కు ఇన్‌చార్జిని అప్పజెప్పి విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆర్‌సీహెచ్ ఏఎన్ఎంకు బదిలీ కావటంతో మళ్లీ ఇక్కడ ఖాళీ కనిపిస్తుంది. ఇంకా పీహెచ్‌సీకి వెన్నుదన్నుగా ఉండాల్సిన అటెండర్ పోస్టు భర్తీ నోచుకోవడం లేదు. అలాగే ఎంపీహెచ్‌వీ (ఎఫ్) పోస్టు భర్తీ కాకపోవడంతో సచివాలయాల ఆరోగ్య పర్యవేక్షణ చర్యలు గాడి తప్పుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇక్కడ ఖాళీ పోస్టుల భర్తీకి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ పరిధిలోని గ్రామస్థులు కోరుతున్నారు.

గుండెపోటుతో పీఈటీ మృతి

ఎస్.కోట రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో క్రీడాకారులకు హ్యాండ్‌బాల్ పోటీలకు శిక్షణ ఇవ్వడానికి వచ్చిన పీఈటీ ప్రదీప్‌భారతి(32) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. తెలంగాణా రాష్ట్రం అదిలాబాద్ జిల్లా జవహర్ నవోదయలో పనిచేస్తున్న ఈయన ఈ నెల 21, 22న బీహార్‌లో జరుగనున్న నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఇక్కడ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి మరో నలుగురు పీఈటీలతో కలిసి వచ్చారు. గురువారం శిక్షణ పూర్తయిన వెంటనే మధ్యాహ్నం భోజనానికి కూర్చున్నారు. ప్లేటు ముందు ఒక్కసారిగా కుప్పకూలారు. సహచరులు వెంటనే ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్‌కు తెలియజేయడంతో, ఆయన వెంటనే బొడ్డవర కోలేకేటేడ్ వైద్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి విద్యాలయం అంబులెన్స్‌లో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. గుండెపోటుతో మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుడిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాగా, ఈయన భార్య తెలంగాణా రాష్ట్రం అదిలాబాద్‌లోని నవోదయలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు.

తలమీద రాయి పడి యువకుడు..

ఎస్.కోట రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో గురువారం విషాధ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాకు చెందిన అమీన్‌ఖాన్(25) విశాఖ-అరకు రోడ్డు పక్కన ఒక చిన్న బట్టల దుకాణం ఏర్పాటుచేసుకుని, జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం 10-30 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి దుకాణం వెనుకకు వెళ్లాడు. అదే సమయంలో పక్కనే ఉన్న భవనంపై పనిచేస్తున్న కార్మికుడు కిందకు రాళ్లు వేశాడు. దీంతో ఒక రాయి అమీన్‌ఖాన్‌పై పడింది. తలపై తీవ్రంగా గాయం అయ్యింది. వెంటనే గుర్తించిన స్థానికులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందాడు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

బొండపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కెరటాం గ్రామంలో ఈనెల 9న నెడుగట్టి అప్పలకృష్ణ(45) హత్య కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు గజపతినగరం సీఐ జీఏవీ రమణ తెలిపారు. గురువారం స్థానిక పోలీసులు స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పలకృష్ణ భార్య నెడుగట్టి రాజుతో అదే గ్రామానికి చెందిన వరుసకు మేనల్లుడు అయిన నారపాటి సాయితో వివాహేతర సంబంధం ఉంది. దీంతో అప్పలకృష్ణను అడ్డు తొలగించుకునేందుకు హత్య చేసినట్టు సాయి అంగీకరించాడు. ఈ కేసులో సాయితో పాటు మృతుడి భార్య రాజును కూడా అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. సీఐ వెంట ట్రైనీ ఎస్ఐ సాయిరాం పడాల్ తదితరులు ఉన్నారు.

బాలగొడబలో పేకాట రాయుళ్లు..

పార్వతీపురం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బాలగొడబ ప్రాంతంలో ఎనిమిదిమంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టుచేశారు. గురువారం పేకాట ఆడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే రూరల్ ఎస్ఐ సంతోషికి సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఆధ్వర్యంలో స్పెషల్‌పార్టీ పోలీసులు, రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఎనిమిది మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2లక్షల 22వేల 130తో పాటు రెండు కార్లు, నాలుగు బైకులు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశారు. కాగా, సీతానగరం మండలంలోని రామవరం శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి రూ.2,330ను ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత అదృశ్యం

పార్వతీపురం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. వివాహిత అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

భోగాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తన మెడలో ఉన్న బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించుకుపోయాడని విశాఖపట్నం జిల్లా శివాజీపాలెంకు చెందిన బూర ఆదిలక్ష్మి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ దుర్గాప్రసాద్‌రావు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన ఆదిలక్ష్మి.. సవరవల్లి పంచాయతీ రామదాసుపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఎ.రాయవలస సమీపంలో బస్సు దిగి, రామదాసుపేట వైపు నడుచుకుంటూ వెళ్తోంది. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం

రాజాం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో రెప్పపాటు కాలంలో ఇద్దరు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. గురువారం మధ్యాహ్నం పాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డోలపేట సమీపానికి వచ్చింది. అదే సమయంలో ఆ బస్సు ముందు నుంచి రేగిడి మండలం నరసనాపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. రోడ్డుపై ఉన్న భారీ గుంతను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సుకు మూడు అడుగుల ముందు బోల్తా పడింది. దీంతో మహిళ రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఇది గమనించిన ఆర్టీసీ డ్రైవర్ షడన్‌గా బ్రేక్ వేయడంతో వారిద్దరూ ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఈ ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలో ఆర్‌అండ్‌బీ సిబ్బంది రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతను మట్టితో కప్పించారు.

ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు

కొత్తవలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పీహెచ్‌సీ స్థలాన్ని కొంత మంది ఆక్రమించి, రాత్రి వేళల్లో పునాదులు తవ్వి షాపులను నిర్మిస్తున్నారు. ఈ ఆక్రమణలను ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఇక్కడ పీహెచ్‌సీ పాత భవనాలను తొలగించి, కొత్తగా భవనాలను నిర్మించేందుకు గత వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. అయితే నిధుల కొరత కారణంగా ఆ నిర్మాణాలు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపింది. ఈ లోగా కొంతమంది ఈ భవనాలను ఆనుకుని ఆక్రమణలు చేసి, షాపుల నిర్మాణానికి పునాదులను సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ ఎస్.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి జి సీతల్‌వర్మ గురువారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్రమంగా నిర్మిస్తున్న పునాదులను కప్పించారు. మరోసారి ఇటువంటి ఆక్రమణలు చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

సీఎం కృషితోనే ఉపాధి నిధుల మంజూరు

రాజాం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసిన పెండింగ్ బిల్లులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 119 పనులకు రూ.46లక్షల 62వేల 503 నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పనులకు 80 శాతం బిల్లులు చెల్లించి మిగిలిన బిల్లులు కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, ముఖ్యమంత్రి చర్యలు తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 20 శాతం నిధులు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. త్వరలో బిల్లులు చెల్లించాల్సిన వారికి చెల్లిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డోలీలతో నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీరును నిరసిస్తూ దారపర్తి పంచాయతీ గిరిజనులు గురువారం డోలీ యాత్ర అనే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆదివాసీ యువత మాట్లాడుతూ మండలంలోని దారపర్తి, బొడ్డవర గిరిశిఖర పంచాయతీలకు రోడ్డు సౌకర్యం కల్పించి, గిరిజనుల ప్రాణాలు కాపాడాలని కోరారు. డోలీలతో నిరసన తెలిపారు.



డోలీలతో నిరసన చేస్తున్న దృశ్యం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి

పార్వతీపురం/సాలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. గురువారం సాయంత్రం జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో చర్చించారు.స్వాతంత్ర్యదినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతులు, మత్స్యకారులు అ ప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కొండ చర్యలు విరిగిపడడం, రోడ్లపై రాకపోకలు బంద్ కావడం, స్తంభాలు పడిపోవడం తదితర కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు

సాలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):సాలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అందిస్తున్న సేవలు, నిబద్ధత, సమయపాలన గుర్తించి వారికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిదులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంపై తప్పుగా మాట్లాడితే ప్రజలు సహించరు

ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని ఎంతగా వ్యతిరేకిస్తున్నారో అని చెప్పడానికి పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన ఉపఎన్నికలే నిదర్శనమని, పులివెందులలో ప్రజాస్వామ్యం ప్రాణంపోసుకుందని, రెండు చోట్ల టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గురువారం సాలూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిపై తప్పుగా మాట్లాడితే ప్రజలు సహించరని తెలిపారు. రామా...కృష్ణా అని ఆయన కుర్చొని ఉంటే ఈ రాష్ట్రాన్ని జగన్మోహన్‌రెడ్డి సర్వనాశనం చేసేసే వారని తెలిపారు.జగన్మోహన్‌రెడ్డికి పిచ్చి బాగా ముదిరిపోయిందని, ఏదో మెంటల్ ఆసుపత్రిలో చేరాలని అలా కాకుంటే తాడేపల్లి గూడెంలో తన ప్యాలెస్‌లో ఉండాలని, అదీ కాకుంటే బెంగళూరులో తన కోటలో నివాసం ఉండాలని ఆమె సలహా ఇచ్చారు.సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), కౌన్సిలర్ హర్షవర్ధన్, వాడాడ శోభారాణితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు: ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హెచ్చరించారు. గురువారం పార్వతీపురంలోని జిల్లా కేంద్రాసుపత్రిని పరిశీలించారు. తొలుత రోగులకు అందుతున్న వైద్య సేవలకు సంబంధిచి వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు. రోగులను లిఫ్ట్‌పై సక్రమంగా తీసుకువెళ్లడం లేదని, మెట్లపై నుంచి తీసుకువెళ్లాల్సివస్తోందని బంధువులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత ఎలక్ట్రీషియన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేయాలని అధికారులను కోరారు. త్వరలో అన్ని వసతులు కలిగిన మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రానుందని చెప్పారు.అనంతరం విజయచంద్ర విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యసేవలతో పాటు ప్రత్యేక చికిత్సలు, సర్జరీలుచేయడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. జిల్లా ఆసుపత్రి నుంచి విజయనగరం, విశాఖలోని ఆసుపత్రులకు రిఫరల్ చేయకుండా అన్ని రకాల వైద్య సదుపాయాలు, చికిత్సలు జిల్లా కేంద్రంలో త్వరలో ప్రారంభంకానున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుతాయని తెలిపారు. ఎమ్మెల్యే వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగశివజ్యోతి ఉన్నారు.



పార్వతీపురం టౌన్: జిల్లా ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న విజయచంద్ర

● పార్వతీపురం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకోసం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. గురువారం మండలంలోని కవిటిభద్ర కేజీబీవీ జూనియర్‌కళాశాలలో 2.12 కోట్లతో నిర్మించనున్న అదనపు వసతుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరానికి హామీనిచ్చారు.

విచారణ నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం

● జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

కొమరాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొమరాడ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులు మేరకు రికార్డులను పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు తెలిపారు.గురువారం కొమరాడ సచివాలయంలో ఫిర్యాదుదారులు, సర్పంచ్ సమక్షంలో నిధులు వినియోగంపై విచారణ నిరహించారు. గ్రామానికి చెందిన కళినబోయిన చంటి, రమేష్ ఇటీవల కొమరాడ పంచాయతీకి చెందిన 35లక్షలరూపాయలు వరకు నిధులు దుర్వినియోగమయ్యాయని కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు.ఈ మేరకు పంచాయతీలో నాలుగు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి నిధులు ఖర్చు వివరాలపై విచారణ చేస్తున్నట్లు కొండలరావు తెలిపారు.పారిశుధ్యనిర్వహణతోపాటు డ్రైనేజీ, శానిటేషన్, కుక్కలు తరలించడం కోసం, వీధిమలుపులు వద్ద చెత్త తరలింపు తదితర అంశాలపై నిధులు ఖర్చుచేసి దుర్వినియోగం చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులు వివరాలు, రికార్డులను పరిశీలించారు. అధికంగా ఇంటి పన్నుల వసూళ్లలో నిధులు దుర్వినియోగమయ్యాయని, ప్రభుత్వానికి నగదు చెల్లించకుండా కార్యదర్శి, సర్పంచ్ వాడుకున్నారని ఫిర్యాదుదారుడు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

యూరియా వచ్చేదెప్పుడు?

(ఏడో పేజీ తరువాయి)

యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

అవసరం కొండంత...సరఫరా గోరింత

ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 21,483 టన్నుల యూరియా అవసరం. కానీ, ఇప్పటివరకు కేవలం 14,481 టన్నులు మాత్రమే సరఫరా అయింది. మార్క్‌ఫెడ్ ద్వారా 7,260 టన్నులు రైతు సేవా కేంద్రాలకు, 7221 టన్నులు ప్రైవేటు డీలర్లకు సరఫరా జరిగింది. ఇంకా 7002 టన్నులు జిల్లాకు రావాల్సి ఉంది. యూరియా కొరతతో రైతులకు పూర్తిస్థాయిలో దొరకని పరిస్థితి ఏర్పడింది. ఆర్ఎస్‌కేల్లో ఎరువులను అందించకపోవడంతో రైతులు ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదేఅదునుగా కొందరు వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. యూరియాకావాలంటే.. జింక్, దుబ్బు గుళికలు, పోటాస్ తదితర కాంప్లెక్స్ ఎరువులను కొనాల్సిందేనని షరతులు పెడుతున్నారు. పైగా వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల్లో 45 కిలోల యూరియా బస్తా రూ.275కు అందించారు. అదే యూరియా బస్తాను ప్రైవేట్ వ్యాపారులు రూ.350 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. దీంతో కొనుగోలు చేసేందుకు కొందరు రైతులు జంకుతుంటే.. మరికొందరు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధర వెచ్చించి యూరియాను తీసుకెళ్తున్నారు.

ఆ దుకాణాల్లో ఎరువులు వి క్రయాలు స్టాప్..

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా చాలామంది దుకాణాల యజమానులు పట్టించుకోవడం లేదు. అధిక ధరలకు యూరియాను విక్రయించడంతో పాటు కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలో సుమారు వంద ఎరువులు దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. సీతానగరంలోని ఒక దుకాణంలో 8 టన్నులు, వీరఘట్టంలోని ఓ దుకాణంలో 37 టన్నులు, పాచిపెంటలోని ఒక షాపులో 10 టన్నుల ఎరువులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నిల్వలు, రికార్డుల్లో తేడాలు ఉండడంతో ఈ మూడు దుకాణాల్లో తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎరువులు విక్రయించవద్దని అధికారులు ఆదేశించారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

దుకాణాల్లో అధిక ధరలకు యూరియా విక్రయించినా, యూరియాతో పాటు ఏమైనా కొనుగోలు చేయాలని నిబంధనలు పెట్టినా చర్యలు తప్పవు. మూడు దుకాణాల్లో విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించిన మాట వాస్తవమే. జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం

సెప్టెంబరు 14న ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్ర అభినయపోటీలు



మాట్లాడుతున్న పీజేనాయుడు

పార్వతీపురం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురంలోని శ్రీవాణి ఆర్ట్స్ 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఉత్తరాంధ్ర స్థాయిలో పౌరాణిక ఏకపాత్ర అభినయ పోటీలు సెప్టెంబరు 14 ఉదయం తొమ్మిది నుంచి నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ నటుడు డాక్టర్ పీజీ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకపాత్రాభినయ పోటీల్లో పాల్గొనే కళాకారులు ఆడియో/వీడియో ద్వారా రెండు పద్యాలు గాని, డైలాగులు గానీ 9440012010, 95550754406 నెంబర్లకు వాట్సాప్‌ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు.విజేతలకు మొదటి బహుమతి రూ.5,200లు ఇత్తడి కిరీటం,ద్వితీయ బహుమతి రూ.3,400లు షీల్డ్, తృతీయ బహుమతి రూ.2,500 నగదు, షీల్డ్, నాలుగు ప్రత్యేక బహుమతులు కింద ఒక్కొక్కరికి రూ.1600లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొనదలచిన కళాకారులు రూ.200లు ప్రవేశరుసుము చెల్లించి ఆడియో/వీడియోలు రికార్డుచేసి ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా శ్రీవాణి ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు బీఎల్ నాయుడు సెల్‌నంబరు 8186076044, కార్యదర్శి జి.తిరుపతి నాయుడు సెల్ నంబరుకు 9550754406కు, కోశాధికారి నాగిరెడ్డి సింహచలం 9849833439 సెల్,వాట్సాప్ నంబర్లకు పంపిచాలని కోరారు.

జిల్లాకు భారీ వర్ష సూచన

(ఏడో పేజీ తరువాయి)

పడడంతో పాటు ఉరుములు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల దగ్గర ఎవరూ నిలబడరాదు. దీనిపై గ్రామాల్లో దండోరా వేయడంతో పాటు మైక్ ద్వారా ప్రచారం చేయాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో కె.హేమలత, ఎస్‌డీసీ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఎఫ్‌వో పి.సింహాచలం ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు 15 మండలాల్లో వర్షాలు పడుతున్నాయి. పార్వతీపురంలో గురువారం ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఏకధాటిగా వాన పడింది. దీంతో పార్వతీపురం ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. దీనివల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులుపడ్డారు. మేదరి వీధి కూడలి నుంచి దేవాంగుల వీధి వరకు ప్రధాన రహదారిపై వరద నిలిచిపోవడంతో స్థానికులు అవస్థలుపడ్డారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో వరదనీటితో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

నాగావళికి వరద ప్రవాహం

గరుగుబిల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ప్రవాహం నెలకొంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పైప్రాంతం నుంచి వరద ప్రవాహం నదిలోకి చేరుతుంది. గురువారం ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి సుమారు 5 వేల క్యూసెక్కుల నీరు చేరగా, స్పిల్‌వే గేట్ల నుంచి 6,500 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్ల నీటి సామర్థ్యానికి గాను 104.05 మీటర్ల సామర్థ్యం ఉంది. అలాగే 2.534 టీఎంసీలకు గాను 1.932 టీఎంసీ నిల్వ ఉంది. ఖరీఫ్‌కు సంబంధించి ప్రధాన కాలువల నుంచి 1,304 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథ రావు, డీఈఈ టి.రఘునాథనాయుడు తెలిపారు.

వెంగళరాయసాగర్ నుంచి నీరు విడుదల

మక్కువ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంబర సమీపంలో ఉన్న వెంగళరాయ సాగర్ జలాశయం నుంచి సువర్ణముఖి నదిలోకి వంద క్యూసెక్కుల వరదనీటిని గురువారం విడిచిపెట్టారు. భారీ వర్షాలు కురిసే ఆస్కారం ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా నీటిని నదిలోకి విడిచిపెట్టినట్లు జేఈ రాజశేఖర్ తెలిపారు.

15 మద్యం సీసాల స్వాధీనం

సీతంపేట రూరల్,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కొత్తకోట జంక్షన్ వద్ద దోను బాయి ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఈ మేరకు 15మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, తరలిస్తున్న బి.వెంకటరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏగిటివలసలో సామాజిక తనిఖీ

సీతానగరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏగిటివలస పంచాయతీలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ పర్యవేక్షణలో సామాజిక తనిఖీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ దాసు ఐఈసీ టీము ద్వారా వేతనదారులకు ఉపాధిహామీ పథకంలోని హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. పథకంలోని పనులపై వివరించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ సిబ్బంది శ్రీను, సురేష్, రమేష్, సర్పంచ్ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు చిన్నారావు, రాంబాబు పాల్గొన్నారు.

జెండా పండుగకు సర్వం సిద్ధం

(ఏడో పేజీ తరువాయి)

పనిచేస్తున్న 599 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించనున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా వారు ప్రశంసాపత్రాలు అందుకోనున్నారు.

ఐటీడీఏలో జాతీయ జెండా ఆవిష్కరించనున్న కలెక్టర్

పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్, ఐటీడీఏ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ప్రస్తుతం ఐటీడీఏకు పూర్తిస్థాయి పీవోలేరు. ఇన్‌చార్జి పీవోగా ఉన్న సబ్ కలెక్టర్‌కు బదిలీ అయింది. కొత్తగా నియామకమైన సబ్ కలెక్టర్‌కు ఇన్‌చార్జి పీవో బాధ్యతను ప్రభుత్వం అప్పగించలేదు.దీంతో ఐటీడీఏ చైర్మన్ హోదాలో కలెక్టర్ జెండాను ఆవిష్కరించనున్నారు.

కేసలి పీఏసీఎస్ చైర్మన్‌గా మజ్జారావు

పాచిపెంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలో కేసలి పీఏసీఎస్ చైర్మన్‌గా మాదిరెడ్డి మజ్జారావుతోపాటు పంట్ల తిరుపతిరావు, ఎం.పోలినాయుడు పాలకవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు గూడేపు యుగంధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొత్తల పోలినాయుడు, మతల బలరాం, కొరిపల్లి సురేష్ పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

మక్కువ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వ సభ్య సమావేశం వాడివేడిగా జరిగింది.వివిధ శాఖల అధికారుల పని తీరుపైసభలో సభ్యులు ధ్వజమెత్తారు.అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారని ఏఈపై సభ్యులు మండిపడ్డారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడం, గృహాలనిర్మాణాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మహిళకోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ గ్యారెంటీలతో పాటు మేనిఫెస్టోలో ఉన్న పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని చెప్పారు. జీవో-3 స్థానంలో గిరిజనులకు న్యాయం చేసేలా తగిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందని చెప్పారు. తాను నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చానని తెలిపారు.

మెరుగైన సేవలందించాలి

విశాఖలోని కేజీహెచ్‌కు తమ నియోజకవర్గం నుంచి వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలందించాలని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి కోరారు.ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణితో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ అందించాలని కోరారు. కాగా తాడికొండకు చెందిన చిన్నారి పత్తిక ప్రణీత కేజీహెచ్‌లో చికిత్సపొందుతుండడంతో ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఖర్చులు నిమిత్తం పాప తల్లిదండ్రులకు రూ.10 వేలు అందజేశారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

మక్కువ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణసౌకర్యంకల్పిస్తుండడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డు జంక్షన్ వద్ద ఆటో కార్మికులతో కలిసి గురువారం నిరసన కార్య క్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కె.భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరేష్, రామకృష్ణ, దాలయ్య పాల్గొన్నారు.

ఏపీఎంపై దాడి అమానుషం

సీతంపేట రూరల్,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో వెలుగు ఏపీఎం రజనీకుమారిపై అల్లరిమూకలు దాడిచేయడం అమానుషమని ఏపీఎం కమలకుమారి పేర్కొన్నారు. దాడికి నిరసనగా గురువారం సీతంపేటలో వెలుగు సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకన్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు మౌళి,వెంకట్రావు,రమణమ్మ,సూరమ్మలతో పాటు వీవోఏలు పాల్గొన్నారు.

పాలకొండలో ఆయుర్వేద వైద్యశిబిరం

పాలకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగాకళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన కమ్యూనకబుల్ వ్యాధులపై అవగాహన, అనంతరం మెగా ఆయుర్వేదం, హోమియో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పావని, విద్యహే, ఆదిలక్ష్మి, నందినిసాయి, శిరీష, జయమణి పాల్గొన్నారు.

ఉప ఎన్నికల ఫలితాలు వైసీపీకి చెంపపెట్టు

గరుగుబిల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జిల్లా ప్రాదేశిక ఉప ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని,ఈ ఫలితాలు వైసీపీకి చెంప పెట్టు అని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం ప్రతినిధి, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబులు తెలిపారు. గురువారం ఖడ్గవలస సముదాయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు బెదిరింపులకు ఓటర్లు భయపడలేదని, ప్రజలు మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా చిరంజీవి

పాలకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.చిరంజీవి బాధ్యతలు గురువారం స్వీకరించారు. ఇంతవరకు మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న నాగభూషణరావుకు మన్యం జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా వెళ్లారు.దీంతో ఆర్ఎంవోగా ఉన్న డాక్టర్ చిరంజీవికి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ శ్రీకాకుళం డీసీహెచ్‌ఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొండ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కెల్ల రవికుమార్‌కు ఆర్ఎంవోగా ఇన్‌చార్జిగా నియమించారు.

కూటమి నాయకుల సంబరాలు

కురుపాం,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమెట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలవడంతో గురువారం రాత్రి కూటమి నాయకులు కురుపాం బస్టాండ్‌లో బాణసంచ కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

సీతంపేట రూరల్,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):గిరిజన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఐటీడీఏ ఏపీవో జి చిన్నబాబు కోరారు. ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న సీతంపేట ఏపీఆర్ బాలుర గురుకులపాఠశాలను గురువారం తనిఖీ చేశారు.వర్షాలు విస్తారంగా కురవనున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రత పట్ల చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ నీలంనాయుడును ఆదేశించారు. పూర్తిగా పాడైన గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిచవొద్దని సూచించారు.

గృహాలు పూర్తి చేయాలి

భామిని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):పీఎం జన్‌మన్ గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. భామినిలో తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ, ఎంపీడీవో వసంతతో సమీక్షించారు వీఆర్వో, ఆర్ఐ తహసీల్దార్ లాగిన్‌ను పరిశీలించి రెవెన్యూ పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోవగూడను సందర్శించి,ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల బిల్లుల విషయంపై మాట్లాడారు. స్థానిక జీపీఎస్ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయనతో ఆర్ఐ మణి ప్రభ, సర్వేయర్ రాజేష్ ఉన్నారు.

జాతీయజెండాను గౌరవించాలి

ప్రతి ఒక్కరూ జాతీయజెండాను గౌరవించాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

కురుపాం,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): కురుపాం బస్టాండ్‌లో ఇంటర్ పోస్టు మెట్రిక్ వసతి గృహం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వసతిగృహం సంరక్షణ అధికారి సీహెచ్ సాంబమూర్తి పాల్గొన్నారు.

గరుగుబిల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీ వో ఎల్.గోపాలరావు, డాక్టర్ ఎస్ఎంకే తిరుమల ప్రసాద్, ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు తిరుపతి రావు, ఎంఈవో వెంకటరావు, కొండలరావు పాల్గొన్నారు.